# ఆఖరి దొంగతనం

రాత్రి ఏడుగంటలు కావస్తున్నప్పుడు అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు దుష్యంతరావు. ట్యూబ్ లైటు కాంతి గదినంతటినీ పరుచుకున్నది. పైన ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు తప్పించి అంతా నిశ్శబ్దంగా వుంది.

"ఏం చేస్తున్నావ్ డియర్?" అన్నాడు అతను తలదువ్వటం ముగించి వెనక్కి తిరుగుతూ—

అతడి భార్య రాజేశ్వరి బెడ్ మీద వెల్లకిలా పడుకుని ఏదో వార పత్రికను చదువుతోంది.

"కథ చదువుతున్నాను" అన్నది చదువుతూనే—

"ఏం కథ" దగ్గరగా వస్తూ అడిగాడు.

"దొంగ కథ"

"యూ ఫూల్. జాగ్రత్తగా మాట్లాడు"

ఉలిక్కిపడి చేతిలో పత్రికను వదిలేసింది రాజేశ్వరి.

దుష్యంతరావు మొహం ఇదివరకటి లేదు. కొంచెం సీరియస్‌గా వుంది.

"ఎందుకిలా అరిచారు?" చిన్నగా అడిగింది.

"నాగురించే కదూ నువ్వు- దొంగ కథ— అన్నది" కోపంగా అడిగాడు.

రాజేశ్వరి పెద్దగా నవ్వి "ఊహు.... కాదు." అంటూ పత్రికను తెరిచి అతడికి చూపించింది.

"సారీ.... రాజేశ్వరీ" అన్నాడు దుష్యంతరావు పత్రికలో 'దొంగ కథ' పేరు చూసి.

"ఈ కథ మన కథలాగే వుంది" అన్నది ఆమె.

"ఎలాగంటావ్?" భార్య పక్కనే కూర్చుంటూ అడిగాడు.

"ఉద్యోగం దొరక్క మీలాంటి ఓ యువకుడు అవసరానికి ఓ చిన్న దొంగతనం చేస్తాడు. అతడి అవసరం తీరుతుంది. ఆ తర్వాత మళ్ళీ చేస్తాడు. మళ్ళీ చేస్తాడు అవసరానికి తలవొంచి. చివరికి అదే ఉద్యోగంగా మారిపోతుంది. అతను దొంగగా మారిపోతాడు. ఐతే అదృష్టం అతన్నెప్పుడూ వదలక పోవటంవల్ల అతనెప్పుడూ పోలీసులకు దొరికిపోడు. కొన్నాళ్ళకు అతనికి పోలీస్ డిపార్ట్‌మెంటులోనే ఉద్యోగం వస్తుంది. వెంటనే అతను ఇక దొంగతనాలు చెయ్యాల్సిన అవసరం లేదని ఆ పనిమానేసి ఉద్యోగిగా కొత్త జీవితాన్ని మొదలుపెడతాడు. ఇదీ దొంగ కథ".

పెద్దగా నవ్వాడు దుష్యంతరావు.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"దొంగకు పోలిస్ డిపార్టుమెంటులో ఉదోగ్యం రావటమా?"

"ఎందుకు రాకూడదు? అతను దొంగని ఎవరికీ తెలీదు. చదువుకున్నవాడు. తెలివివున్న వాడు. అందు కే అతడికి వుద్యోగం వచ్చింది. నాకేమీ ఆశ్చర్యంగా అనిపించలేదు. కథ చాలా సహజంగా అనిపించింది" అన్నది రాజేశ్వరి.

"ఇంతకీ- దొంగకథ- మన కథలాగా ఎలా వుంది?"

"ఆ కథలో యువకుడిలాగా మీరు కూడా-" ఆగిపోయింది.

"అవును రాజేశ్వరీ.... నేను కూడా దొంగనే. చదువుకున్న వాడిని. ఉద్యోగం దొరక్క దొంగగా తయారయిన వాడిని. నాకూ బాధగానే వుంది'' అన్నాడు దుష్యంతరావు.

"ఎన్నాళ్ళీ దొంగ బతుకు?" అన్నదామె భర్త కళ్లలోకిచూస్తూ.

"త్వరలోనే ఈ జీవితానికి చుక్క పెడదామనుకుంటున్నాను. ఇప్పటి వరకూ అదృష్టం మనవైపునే వున్నది. అందుకే ఇన్ని దొంగ తనాలు చేసినా ఒక్కసారి కూడా ఎక్కడా దొరికిపోలేదు. కాని– ఎప్పుడో ఓసారి ఈ అదృష్టం మొహం చాటు చేసినప్పుడు మనిద్దరి బతుకులూ కాలిపోయినట్టే...."

ఒక్క నిముషం రాజేశ్వరి ఏమీ మాట్లాడలేకపోయింది.

పెళ్ళికి ముందు దుష్యంతరావు తనో దొంగ అనే నిజాన్ని నిజాయితీగా రాజేశ్వరితో చెప్పాడు. ఐతే ఏ పరిస్థితుల్లో తను దొంగ జీవితాన్ని మొదలుపెట్టాడో వివరంగా చెప్పాడు. కొద్ది రోజుల్లో ఆ జీవితానికి తెర దించబోతున్నట్టు కూడా చెప్పాడు. రాజేశ్వరి అతడి మాటలను నమ్మింది. అతడి మాటల్లోని నిజాయితీని విశ్వసించింది. అతనితో మూడు ముళ్ళు వేయించుకోటానికి తలవంచింది

ఆమెకి ఎవ్వరూలేరు. ఎవరో దూరపు బంధువులింట్లో పనిమనిషి హోదాలో పెరిగింది.

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అడిగాడు అతను- ఆమెను.

"మన పెళ్ళయి ఏడాదికావస్తోంది. ఇంకా మీరు దొంగతనాలు మానెయ్యలేదు"


ఆమె మీదకి వంగి "రాజేశ్వరీ.... నన్ను నమ్ము.... ఇదే ఆఖరి దొంగతనం. ఇప్పటికి దొంగతనాలు చేసి బాగానే సంపాదించాను. ఆ డబ్బుతో ఏదయినా బిజినెస్ చేస్తాను. అప్పుడు మనం భయంలేని బతుకును ఆహ్వానించవచ్చు" అన్నాడు ఉత్సాహంగా–

"నిజంగా ఇవాళ మీరు చేసుకువచ్చేది ఆఖరి దొంగతనమా?" ఆశగా అడిగిందామె–

"అవును. ప్రామిస్" అన్నాడు దుష్యంతరావు.

"ఏమిటి ? వళ్ళుపొడా ? టూత్ పేస్టా?" అన్నది రాజేశ్వరి నవ్వుతూ-

"కాదు. వాగ్దానం. ఇవాల్టిదే ఆఖరి దొంగతనం. నాలుగు రోజుల్నించీ ఇవాళ దొంగతనానికి ప్లాన్ చేశాను తప్పకుండా విజయ లక్ష్మితో తిరిగొస్తాను".



"విజయలక్ష్మి ఎవరు? ఆమెనేనా మీరు చివరిసారిగా దొంగ తనం చేసి తీసుకువచ్చేది?" కళ్లని పెద్దవిచేస్తూ అడిగిందామె-

"యూ సిల్లీ" అంటూ భార్య బుగ్గమీద చిటికె వేశాడు దుష్యంత రావు.

"భోజనం చేద్దామా. ఆకలవుతోంది" అన్నది రాజేశ్వరి బెడ్ మీదనుంచి దిగుతూ-

తల వూపాడతను నిల్చుంటూ-

రాజేశ్వరి వంట గదిలోకి వెళ్ళింది.

అతను కిటికీ దగ్గరకు వెళ్ళి బయటకు చూస్తూ నిల్చున్నాడు.

దుష్యంతరావును ఎవ్వరూ దొంగ అనుకోరు. అతను ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టుగా అందరినీ నమ్మిస్తున్నాడు. ఆఫీసుకు వెళ్ళే ఉద్యోగిలాగే ఉదయం తొమ్మిది గంటలకు ఇంట్లో బయల్దేరతాడు. సాయంత్రం ఆరున్నరకల్లా ఇంటికి వస్తాడు. సెలవు రోజుల్లో ఇంట్లోనే గడుపుతాడు. అప్పుడప్పుడు బయటనించి వస్తూ లోపల కాగితాల్లేని ఫైళ్ళు ఇంటికి తీసుకువస్తూ వుంటాడు. దుష్యంతరావు గొప్ప నటుడు.

రాజేశ్వరి పిలిచింది.

అతను వెళ్ళాడు.

ఇరవై నిముషాల తర్వాత ఇద్దరూ కిచెన్‌లోనించి బయటకు వచ్చారు.

అతను సిగరెట్టు ముట్టించాడు.

ఆమె టేబిల్‌మీద వున్న పేక అందుకున్నది. రాత్రి పది గంటల వరకూ ఇద్దరూ పేకాడుతూ కూర్చున్నారు.

పది గంటలకు దుష్యంతరావు లేచి దొంగతనానికి బయల్దేరాడు. అవసరమైన పరికరాలన్నీ జేబులో పెట్టుకుని రాజేశ్వరితో "ఇదే ఆఖరి దొంగతనం" అన్నాడు.

"జాగ్రత్త" అన్నది.

"నువ్వుకూడా జాగ్రత్త. ఎలర్టుగా వుండు. రాత్రి ఏ టైమ్‌లో ఐనా వచ్చి తలుపు కొడతాను. మరీ మొద్దు నిద్రపోకు. బై" అని బయటకు వెళ్ళిపోయాడు.

గేటుదాటి అతను రోడ్డుమీదకు వెళ్ళేవరకు అక్కడే నిలబడింది ఆమె. తర్వాత తలుపులను మూసి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడింది.

రోడ్డుమీద ఎవ్వరూ తిరగటం లేదు. చలికాలం కావటంతో ఇళ్ళ తలుపులు మూసివున్నాయి. కొంచెం దూరంలోవున్న మెయిన్ రోడ్డుమీద మోటారు వాహనాలు తిరుగుతున్న చప్పుడు వినపడుతోంది.

ఆఖరి దొంగతనంలో ఎవరికీ దొరికిపోకుండా అతను రాగలడా? అదృష్టం ఇంకా తన భర్తని అంటి పెట్టుకునే వుందా?

కిటికీ దగ్గర్నించి కదిలి ఈ వూహలను తట్టుకోలేక లైటార్పి బెడ్ మీద పడుకుని కళ్ళు మూసుకుంది రాజేశ్వరి. ఆమె కళ్ళముందు ఇద్దరు పోలీసులు దుష్యంతరావును తుపాకులతో వెంటపడుతున్న దృశ్యం కనపడింది.

* * * * *

"రాజేశ్వరీ" తలుపులమీద తట్టాడు దుష్యంతరావు. అప్పుడు రాత్రి రెండున్నర దాటుతోంది.

రాజేశ్వరి పలకలేదు.

అతను మళ్ళీ పిలుస్తూ ఇంకొంచెం గట్టిగా తలుపులు నెట్టాడు. తెరుచుకుంది.

ఆశ్చర్యంగా లోపలకు వచ్చి లైటు వెలుతుర్లో బెడ్ మీద పడి వున్న రాజేశ్వరిని చూసి వెంటనే మళ్ళీ ఆశ్చర్యపోయాడు.

ఆమె కాళ్లు - చేతులు కట్టేసి వున్నాయి. నోటికి టేప్ అతికించ బడి వుంది. కళ్ళు తెరుచుకుని చూస్తోంది.

"ఏమిటి రాజేశ్వరీ? ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడతను కట్టు వూడతీసి- టేపు పీకి-

ఒక్క నిముషం ఆగి "గంటక్రితం తలుపుమీద కొట్టిన చప్పు డయ్యింది. మీరే అనుకుని తెరిచాను. కాదు. ఎవరో యువకుడు మీలాగే వున్నాడు. ఎవరని అడిగితే దొంగనని చెప్పాడు. కత్తితో బెదిరించి కాళ్ళూ చేతులూ కట్టి నగలన్నీ లాక్కున్నాడు. ఇల్లంతా తిరిగాడు. డబ్బు తీసుకున్నాడు"

"నాగురించి చెప్పలేదా? ఇదికూడా ఓ దొంగ ఇల్లనీ దోచుకో వద్దనీ నువ్వు చెప్పలేదా?"

"చెప్పాను. ఐనా దొంగల్లో నిజాయితీ ఏమిటి? దొరికింది దోచుకోవటమే దొంగ డ్యూటీ. నా డ్యూటీ నేను చేస్తున్నాను–" అన్నాడతను. ఆశ్చర్యం యేమిటంటే అతనికి ఇది ఆఖరి దొంగతనం అని చెప్పాడు.

* * *

"ఏమిటీ! వాడిక్కూడా ఇది ఆఖరి దొంగతనమన్నాడా?" అంత బాధలోనూ ఆశ్చర్యపడుతూ అడిగాడు.

"అవును. మీరు పెళ్ళయిన తర్వాత దొంగతనం మానెయ్యా లనుకున్నారు. కాని అతను పెళ్ళికి ముందే దొంగతనాలు మానెయ్యా లనుకున్నాడుట. అతను కూడా నిరుద్యోగి. అవసరాల కొద్ది దొంగ తనాలు మొదలుపెట్టి బాగానే సంపాదించాడుట. అతను ఈ మధ్యనే కామేశ్వరి అనే అమ్మాయిని ప్రేమించాడుట. దొంగతనాలు మానేస్తే కానీ అతన్ని చేసుకోనని గట్టిగా చెప్పిందిట ఆ అమ్మాయి. ఇదే ఆఖరి దొంగతనమని ఆ అమ్మాయికి ప్రామిస్‌చేసి మనింటికి దొంగ తనానికి వచ్చాడుట. వెళుతూ నేను అరిచి ఎవర్నీ పిలవకుండా నోటికి టేపు అంటించి వెళ్ళిపోయాడు. ఆశ్చర్యంగా వుందికదూ? ఈ దొంగ కథ'' అన్నది రాజేశ్వరి అంతా చెప్పి.

"అవును. ఒక దొంగ ఇంటిని మరో దొంగ దోచుకోవటం దొంగల నియమాలకే విరుద్ధం. ఇలాంటి విషయం గురించి నేనెప్పుడూ విన్లేదు. నిజానికి ఈ విషయాన్ని పేపర్లో వేయించవచ్చు. కాని మనం దొరికిపోతాం" అంటూ లేచి వెళ్ళి తలుపులు మూసి బోల్టువేసి గోడవారగా జారవిడిచిన సూట్కేసును తీసుకువచ్చి బెడ్ మీద పడేశాడు.

"ఇంతకీ మీ ఆఖరి దొంగతనం ఏమయ్యింది?" అన్నది రాజేశ్వరి.

"చూడు డియర్.... నీకే తెలుస్తుంది?" అంటూ సూట్కేసు తెరిచి అందులో వున్న వస్తువులన్నింటినీ పక్కమీదకు వంచాడు.

వెండి- బంగారు నగలతోపాటు అందంగావున్న ఓ పర్సుకూడా సూట్కేసులోనించి పడింది.

దాన్ని తీసుకుని తెరిచి అదో రకంగా అరిచింది రాజేశ్వరి.

ఉలిక్కిపడి "ఏమిటి? ఎందుకలా అరిచావ్?" అన్నాడు దుష్యంత రావు.

ఆమె- అతడితో ఆ పర్సులోవున్న ఫోటోను చూస్తూ "ఇతనే.... మనింట్లో ఆఖరి దొంగతనం చేసిన యువకుడు" అన్నది.

"మైగాడ్!" అన్నాడు దుష్యంతరావు ఆశ్చర్యంతో.

*

(ఫిబ్రవరి' 90 'జ్యోతి' మాసపత్రిక)